


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 17 | బుధవారం 17 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# అమరావతిని మీ రెండో నివాసంగా ఎంచుకోండి



## సింగపూర్ వేదికగా చంద్రబాబు పిలుపు

**సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో బిజినెస్ రోడ్ షో**

**'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీకి పేటెంట్ ఉందన్న సీఎం**

**విశాఖ సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో బిజినెస్ రోడ్ షో**

**పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితమైన ప్రాంతమని వెల్లడి**

**భారత్‌కు ఏపీ ఎకనమిక్ పవర్‌హౌస్‌గా మారుతుందని ధీమా**

వార్త సాక్ష్యం: ఆంధ్రప్రదేశ్‌ను, ముఖ్యంగా రాజధాని అమరావతిని తమ రెండో నివాసంగా ఎంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సాదరంగా పిలుపునిచ్చారు. పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూలమైన, సురక్షితమైన గమ్యస్థానమని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు తమ ప్రభుత్వమే పేటెంట్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో పాల్గొన్న చంద్రబాబు, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మూడు దశాబ్దాలుగా బలమైన అనుబంధం ఉంది. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ నాకు స్ఫూర్తి. రాష్ట్ర విభజన -మిగతా2లో



# మెట్రోపై రగడ..

## ఐఆర్ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి: కిషన్ రెడ్డి

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్న కిషన్‌రెడ్డి**

**మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య**

**అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి**

**తాను చెబితే ప్రాజెక్టులు ఆగవన్న కిషన్‌రెడ్డి**

**దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు**

వార్త సాక్ష్యం: హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్రం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఖండించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని 2లో

# ఓటరు జాబితా సవరణ...

## బూత్ లెవల్ క్యాడర్ కు మంత్రి సీతక్క దిశానిర్దేశం



**●బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారన్న సీతక్క ●ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచన ●ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపు**

వార్త సాక్ష్యం:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తెలంగాణ మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని 2



# పవన్‌పై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు..

పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మ అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శ
ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలపై దృష్టి పెట్టాలని సూచన

- **ఏపీకే పరిమితం కావాలని హితవు**
- **తెలంగాణపై బాధ్యతారహిత వ్యాఖ్యలు సరికాదని పవన్‌కు హెచ్చరిక**
- **పవన్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల మౌనాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్**

వార్త సాక్ష్యం:ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారారని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఇక్కడి ప్రజల గురించి పవన్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, ఇటు మిగతా2లో



# ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యం

మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు.

వార్త సాక్ష్యం: రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. మిగతా2లో



# పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్

**●రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!**

**●గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీశ్**

**●తమ శాఖల్లో ఏం జరుగుతోందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా**


**●పిల్లలకు ఇచ్చే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా అని మండిపాటు**

వివరాలు2లో


# దేశ రాజధాని ఢిల్లీ జనాభా భారీగా పెరిగింది

## సెన్సస్ తొలిదశ గణాంకాలు వెల్లడి

- **●సెన్సస్ 2027 తొలి దశలో 2.3 కోట్లు దాటిన ఢిల్లీ జనాభా**
- **●2011తో పోలిస్తే 15 ఏళ్లలో 37.5 శాతం వృద్ధి నమోదు**
- **●ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల మంది జనాభా**
- **●ఇవి ప్రాథమిక గణాంకాలేనని, తుది నివేదిక 2027లో వస్తుందని వెల్లడి**



వార్త సాక్ష్యం: దేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా మిగతా2లో



# అడవిలో అన్నలపై కవిత కీలక వ్యాఖ్యలు

- **●'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా కవితకు అడ్డంకులు**
- **●మంచిర్యాల ఆర్కే-7 గని వద్ద కవితను నిలువరించిన పోలీసులు**
- **●ఆంక్షలను ఛేదించుకుని కార్మికులతో మాట్లాడిన ఎమ్మెల్సీ**
- **●కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు** 2

# ట్రంప్‌తో చర్చల కోసం ఇరాన్ వినూత్న వ్యూహం

- **●ట్రంప్‌తో శాంతి చర్చల కోసం సైకాలజిస్టులను నియమించిన ఇరాన్**
- **●ట్రంప్ మానసిక ప్రవర్తనను అంచనా వేయడమే లక్ష్యం**
- **●ఈ వ్యూహం ఫలించిందని.. ట్రంప్ స్పందన మెరుగైందని వెల్లడి**
- **●నాలుగు నెలల చర్చల తర్వాత ఇరు దేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం**
- **●స్విట్జర్లాండ్‌లో జరగనున్న ఒప్పందంపై సంతకాల కార్యక్రమం**



వార్త సాక్ష్యం:పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుసరించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయడానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ మిగతా2లో

# అమరావతిని మీ రెండో నివాసంగా ఎంచుకోండి

-మొదటిపేజీ తరువాయి:
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మూడు దశాబ్దాలుగా బలమైన అనుబంధం ఉంది. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ నాకు స్ఫూర్తి. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణానికి సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చింది. ఇప్పుడు అమరావతితో పాటు రాష్ట్రంలోని ఇతర పట్టణాల అభివృద్ధిలోనూ సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం" అని అన్నారు.

**పరిశ్రమలకు శరవేగంగా అనుమతులు**

రాష్ట్రంలో పరిశ్రమలకు భూ కేటాయింపులు, అనుమతులు అత్యంత వేగంగా ఇస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అతి తక్కువ సమయంలోనే అన్ని అనుమతులు ఇచ్చాం. 2028 నాటికి ఆ సంస్థ ఉత్పత్తి ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. అలాగే గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా హబ్ ఏర్పాటు కాబోతోంది. దానికి గ్రీన్ ఎనర్జీ సరఫరా చేస్తాం. గూగుల్‌తో పాటు మరో 10 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ కంపెనీలు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల యూనిట్ ప్రారంభిస్తోంది" అని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**భవిష్యత్ భారత్‌కు ఏపీ పవర్‌హౌస్**

'వికసిత్ భారత్ 2047' స్ఫూర్తితో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌కు రూపకల్పన చేశామని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్.. భారత ఆర్థిక వ్యవస్థకు పవర్ హౌస్‌గా మారుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "సుదీర్ఘ తీరప్రాంతం, అపార ఖనిజ సంపద, అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఏపీ సొంతం. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం దేశంలోనే కీలకంగా ఉంది. రాష్ట్రంలో, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాలు ఉండటం మనకు కలిసొచ్చే అంశం. ఏపీ నుంచి ఎగుమతులు పెంచేందుకు పోర్టులు, ఎయిర్‌పోర్టులను సిద్ధం చేస్తున్నాం" అని అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి తెలిపారు. "అమరావతిలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు కలిసి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఇది పనిచేయడం ప్రారంభిస్తుంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలను కలిపేలా హైస్పీడ్ రైల్ నెట్వర్క్‌ను అమరావతికి అనుసంధానిస్తాం. ఇక్కడ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తాం" అని వివరించారు.

**అభివృద్ధిలో దూసుకెళుతున్న ఏపీ**

రాష్ట్రంలో 6 ఆపరేషనల్ పోర్టులు, 7 ఎయిర్‌పోర్టులు ఉన్నాయని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ పెరుగుతుందని చంద్రబాబు తెలిపారు. పరిశ్రమల కోసం 26 ప్రత్యేక పాలసీలు అమలు చేస్తున్నామని, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. "ఏపీకి వచ్చి మా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను స్వయంగా పరీక్షించి, ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావడానికి ఇదే సువర్ణావకాశం" అని చంద్రబాబు పారిశ్రామికవేత్తలను కోరారు. ఈ సమావేశంలో మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఈడీబీ సీఈఓ షన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్‌పై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు..

-మొదటిపేజీ తరువాయి:
ఇటువంటి వ్యాఖ్యలను ఎంతమాత్రం సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం, అనేక త్యాగాల ఫలితంగా, సోనియా గాంధీ చొరవతో కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న పవన్ కల్యాణ్, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. పవన్ తన మాటల ద్వారా బీజేపీ అజెండానే అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా తన బాధ్యతలపై దృష్టి సారించాలి తప్ప, తెలంగాణ వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవద్దని పవన్‌కు సూచించారు. తెలంగాణలో జనసేన పార్టీని విస్తరించే వ్యూహంలో భాగంగానే పవన్ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మౌనంగా ఉండటాన్ని ఆయన తప్పుబట్టారు. వారి మధ్య ఏవైనా లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా? అని మహేశ్ గౌడ్ అనుమానం వ్యక్తం చేశారు.

# ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యం

-మొదటిపేజీ తరువాయి:
ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

# ట్రంప్‌తో చర్చల కోసం ఇరాన్ వినూత్న వ్యూహం

-మొదటిపేజీ తరువాయి:
ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ.. "ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము" అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89% డెమోక్రాట్లు, 30% రిపబ్లికన్లు ఉండటం గమనార్హం. 2025 జనవరిలో 80 ఏళ్ల వయసులో ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అమెరికా చరిత్రలోనే అత్యంత వృద్ధ అధ్యక్షుడిగా రికార్డు సృష్టించారు. అప్పటి నుంచి ఆయన పలు దేశాల నుంచి దిగుమతులపై భారీ సుంకాలు విధించడం, అక్రమ వలసదారులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా ఫెడరల్ ఏజెంట్లను మోహరించడం వంటి వేగవంతమైన, దూకుడైన నిర్ణయాలు తీసుకున్నారు. అనేకమంది విశ్లేషకులు గెలవడం కష్టమని భావించిన యుద్ధంలోకి కూడా అమెరికాను నడిపించారు. దాదాపు 4 నెలల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లో శుక్రవారం సంతకాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరఫున పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పాల్గొంటారని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజీద్ తఖ్త్-రవంచి తెలిపారు.

# దేశ రాజధాని ఢిల్లీ జనాభా భారీగా పెరిగింది

-మొదటిపేజీ తరువాయి: దేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా ఉన్న జనాభా, గత 15 ఏళ్లలో సుమారు 37.5 శాతం పెరగడం గమనార్హం. సెన్సస్ 2027లో భాగంగా చేపట్టిన 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' తొలి దశ ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు ఢిల్లీలోని 45,863 బ్లాకులలో పర్యటించి దాదాపు 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ వివరాల ఆధారంగా జనాభాను ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, ఈ గణాంకాలు తాత్కాలికమైనవేనని అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో చేపట్టనున్న రెండో దశ 'జనాభా లెక్కింపు' తర్వాతే తుది జనాభా సంఖ్యను ఖరారు చేస్తారు. రెండో దశలో ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. జిల్లా వారీగా చూస్తే, ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల జనాభా ఉండగా, నైరుతి ఢిల్లీలో 25 లక్షల మంది నివసిస్తున్నారు. అత్యల్పంగా న్యూఢిల్లీ జిల్లాలో కేవలం 2 లక్షల జనాభా నమోదైంది. 2026 మధ్య నాటికి ఢిల్లీ జనాభా సుమారు 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో వచ్చిన అంచనాలకు, తాజా గణాంకాలు దగ్గరగా ఉండటం విశేషం.

# మెట్రోపై రగడ..

-మొదటిపేజీ తరువాయి: మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో రేవంత్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 అమలుకు కేంద్రం రూ.1,200 కోట్లు అందించిందని వెల్లడించారు. మెట్రో విస్తరణ కోసం మరింత చురుగ్గా పనిచేయాలని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానన్నారు. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రుణం పొందేందుకు కూడా కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. ఐఆర్ఎఫ్‌సీ రూ.13 వేల కోట్ల రుణ ప్రతిపాదన విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని తెలిపారు. వాటిని కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సింది పోయి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఆ సమస్యను తనపై నెట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీ విద్యుత్ ప్రాజెక్టు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి అవసరమైన రుణాల మంజూరుకు కూడా కేంద్రం ఎన్‌ఓసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం ఎలాంటి వివక్ష చూపదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. కిషన్‌రెడ్డి చెప్పినంత మాత్రాన ప్రాజెక్టులు ఆగిపోవని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు.

# ఓటరు జాబితా సవరణ...

-మొదటిపేజీ తరువాయి: బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమకు కేటాయించిన హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, క్షేత్రస్థాయిలో ఓటర్లకు అండగా నిలవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతినకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..

-మొదటిపేజీ తరువాయి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, టైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

## అడవిలో అన్నలపై కవిత కీలక వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి: టీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత మావోయిస్టుల ఉనికిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అడవుల్లో మావోయిస్టులు ఉన్న సమయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించేవారని, ప్రస్తుతం వారు లేకపోవడంతో అధికారుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆమె చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. తన వారం రోజుల పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని ఆర్కే-7 గని వద్దకు చేరుకున్న కవితను పోలీసులు, సింగరేణి భద్రతా సిబ్బంది గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ కొద్దిసేపు వాగ్వాదం నెలకొంది. చివరకు ఆమె ఆంక్షలను అధిగమించి ముందుకు సాగి, కార్మికులతో సమావేశమయ్యారు. మందమర్రిలోని కాసిపేట-1 గని నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కవిత, పర్యటనలో రెండో రోజైన సోమవారం ఈ ఘటనను ఎదుర్కొన్నారు. గేట్ మీటింగ్ నిర్వహించకుండా అధికారులు అడ్డుకోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె ధ్వజమెత్తారు. గతంలో కార్మికుల సమస్యలపై రాహుల్ గాంధీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతానికి వచ్చినప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆమె ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తే టీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని కవిత హెచ్చరించారు. కార్మికుల సంక్షేమం, ఉపాధి సమస్యలు, ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ వంటి అంశాలపై నేరుగా కార్మికులతో చర్చించేందుకే తాము 'బాయి బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పట్టణంలో ప్రజలకు తప్పని మంచినీటి కష్టాలు - సిపిఎం

**10 రోజులైనా మరమ్మతులకు నోచుకోని మోటారు**

**దాహంతో అధికారుల కోసం ఎదురుచూస్తున్న కాలనీవాసులు**



ఆత్మకూరు జూన్ 16 వార్త సాక్ష్యం

పట్టణంలోని దుద్యాల రోడ్డు జగనన్న కాలనీ సమీపంలోని ఫాతిమా నగర్ లో ఉన్న మోటర్ చెడిపోయి పది రోజులు కావస్తున్న మరమ్మతులకు నోచుకోక కాలనీవాసులకు నీటి కష్టాలు తప్పడం లేదని అధికారులు స్పందించి చెడిపోయిన మోటార్ను మరమ్మతులు చేయించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫాతిమా నగర్ కాలనీకి వెళ్లి కాలనీవాసులతో క్షేత్రస్థాయిలో సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరశీ సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ జగనన్న కాలనీ లో ఫాతిమా నగర్ కాలనీలో దాదాపు 50 కుటుంబాలు పైగా నివసిస్తున్నారు.దీంతో కాలనీవాసులు నీటి కోసం సుమారు అర్థ కిలోమీటర్ మేర కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. మోటార్ మరమ్మతులు చేయాల్సిన అధికారులు ఎవరు కూడా ఇంతవరకు పట్టించుకోవడంలేదని దీంతో కాలనీవాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు అన్నారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెడిపోయిన మోటార్ మరమ్మతులను వెంటనే చేయాలని లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరిష్కారం అయ్యేంత దాకా ధర్నా నిర్వహించేందుకు సిద్ధం అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ కుళ్లాయప్ప శివరాం సింగ్ కాలనీవాసులు సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానంలో వైభవంగా స్వర్ణరథోత్సవం



శ్రీశైలం జూన్16 వార్త సాక్ష్యం



ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించరు . ఆరుద్రోత్సవంలో భాగంగా మంగళవారం వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని ఊరేగించారు. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు నిర్వహించారు .ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యురాలు జిల్లెల శ్రీదేవి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరు నియోజకవర్గం ఎన్డీయే ప్రభుత్వ 2 ఏళ్ల అభివృద్ధి సమావేశం

**-నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇశీన్చార్జి అధ్యక్షులు మండ్ర శివానందరెడ్డి**

**-కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యం**

**-నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

నందికొట్కూరు జూన్ 16 వార్త సాక్ష్యం





మంగళవారం పట్టణంలో ని అల్లూరు రోడ్డులోని ఎన్.ఎస్ ఫంక్షన్ హాల్ జరిగిన కూటమి ప్రభుత్వం 'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో కలిసి ఎన్డీయే ప్రభుత్వ 2 ఏళ్ల పాలనపై నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమం నిర్వహించారు నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి లు హాజరయ్యారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం నంద్యాల పార్లమెంట్ టిడిపి పార్టీ ఇశీన్చార్జి మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు ప్రజల్లో ఎమ్మెల్యే జయసూర్య కు పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు.. కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనులు ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయని, ప్రజల మద్దతుతో మరింత వేగంగా అభివృద్ధిని కొనసాగిస్తామని మాండ్ర శివానందరెడ్డి స్పష్టం చేశారు. అనంతరం 625 స్వయం సహాయక సంఘాలకు 75,50,00000/- రూపాయలు మరియు 159 స్వయం సహాయక సంఘాలకు 32,03,00,000 రూపాయల చెక్కులను మహిళల సంఘాలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు వెంకట శివుడు యాదవ్, నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు మహిళలు తెలుగుదేశం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హోం శాఖ మంత్రికి వైసిపి మాజీమంత్రి అమర్నాథ్ క్షమాపణ చెప్పాలి








**-వంగలపూడి అనిత పై నిరసన జ్వాలలు చేపట్టిన టిడిపి మహిళా సంఘాలు**

**-అనుచిత వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేయాలంటూ మహిళల ఆందోళన**

ఆత్మకూరు జూన్ 16 వార్త సాక్ష్యం

శ్రీశైలం నియోజకవర్గ శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో సోమవారం రాత్రి రాష్ట్ర మాజీ మంత్రి వైసీపీ నాయకులు గుడివాడ అమరనాథ్ ప్రస్తుత రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత మీద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలో శ్రీశైలం నియోజకవర్గం టిడిపి పార్టీ మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి నియోజకవర్గ టిడిపి పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు సరోజ టిడిపి పట్టణ ఉపాధ్యక్షురాలు కలబండి శిరీషల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ లోని అంబేద్కర్ సర్కిల్ నుంచి వైసిపి రాష్ట్ర మాజీ మంత్రి అమర్నాథ్ ఫోటోను చెప్పులతో కొట్టి, వినూత్నంగా కోడి గుడ్లతో కొట్టి నిరసన తెలియజేసి, స్థానిక పోలీస్ స్టేషన్ లో అమర్నాథ్ పై ఫిర్యాదు చేశారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో టిడిపి మహిళలు మాట్లాడుతూ రాష్ట్రంలో హోం శాఖ మంత్రిగా ఉంటూ మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు రాష్ట్రంలో వైసీపీ పార్టీ నేతలు మహిళలపై చిన్నచూపు చూస్తూ మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వైసీపీ నేతలు ప్రవర్తించడం సరైన విధానం కాదని వివరించారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం పెద్దపీట వేసిన విషయాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి అమర్నాథ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శ్రీశైలం నియోజకవర్గం టిడిపి మహిళలు మీడియా ద్వారా తమ ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనపై ఆందోళన వద్దు

**బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా**

**పట్టణంలో విస్తృతంగా పర్యటించిన మోమిన్ షబానా**

**అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించరు**

**కేంద్ర ప్రభుత్వ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన**

ఆత్మకూరు జూన్ 16 వార్త సాక్ష్యం





కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర పునర్వ్యవస్థీకరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్ ) కార్యక్రమంపై ఓటర్లు ఎవరూ ఎలాంటి ఆందోళన, చెందాల్సిన అవసరం లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా స్పష్టం చేశారు.సర్ కార్యక్రమం అవగాహనలో భాగంగా మంగళవారం పట్టణంలో శ్రీశైలం నియోజకవర్గ బీజేపీ శ్రేణులు, బూత్ స్థాయి ప్రతినిధులతో బి ఎల్ ఏ.ల తో. కలిసి ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్లను ప్రత్యక్షంగా కలుస్తూ, ఈ ప్రత్యేక కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను మరియు కేంద్ర ప్రభుత్వ ఆశయాన్ని వారికి క్షుణ్ణంగా వివరించారు. ?ఈ సందర్భంగా మోమిన్ షబానా మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు బి ఎల్ ఓ, ఇంటింటికీ తిరిగి చేస్తున్న ఈ సర్వే కేవలం ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఉన్న డబుల్ ఓటింగ్‌ను, అలాగే మరణించిన వ్యక్తుల పేరిట ఉన్న ఓట్లను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని మాత్రమే తొలగించేందుకు ఉద్దేశించినదని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరును జాబితా నుండి తొలగించే ప్రసక్తే లేదని ఆమె ఓటర్లకు భరోసా ఇచ్చారు. ఈ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు ఉన్నా, ఏవైనా సందేహాలు తలెత్తినా నేరుగా తనను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ ఎంతో విలువైనదని, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆమె పేర్కొన్నారు.

**21 సంవత్సరాల తర్వాత ప్రతిష్టాత్మక ప్రక్షాళన**

దేశంలో గత 2002-2004 కాలంలో చివరిసారిగా ఇటువంటి సమగ్ర ఇంటెన్సివ్ రివిజన్ జరిగిందని, ఆ తర్వాత సుమారు 21 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ ఇప్పుడే ఇంతటి భారీ దేశవ్యాప్త సమగ్ర ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టిందని బీజేపీ నాయకులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో ఉపాధి, విద్య రీత్యా ప్రజల వలసలు పెరగడం, మరణించిన వారి వివరాలు సకాలంలో నైపుణ్యంతో తొలగించకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అనేక తప్పులు దొర్లాయని వివరించారు. ప్రజాస్వామ్య పునాదులను పటిష్టం చేసేందుకు, ఒకరికే ఓటు - ఒకే చోట ఓటు అనే సూత్రాన్ని అమలు చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఈ బృహత్తర ప్రతిపాదనను ముందుకు తెచ్చిందని స్పష్టం చేశారు. పట్టణంలో పర్యటనలో మోమిన్ షబానా చూపిన చొరవ, ఓటర్లతో మమేకమైన తీరు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. సుప్రీంకోర్టు సైతం ఈ సార్ ప్రక్రియను రాజ్యాంగబద్ధమైనదని, ఉచిత మరియు నిష్పక్షపాత ఎన్నికలకు అత్యంత అవసరమని సమర్థించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సామాన్య ఓటర్లలో ఉన్న భయాలను తొలగించేందుకు ఆమె స్వయంగా రంగంలోకి దిగడం అభినందనీయమని స్థానిక విశ్లేషకులు కొనియాడారు వీరి వెంట సచివాలయ సిబ్బంది, బి ఎల్ ఏ. బి ఎల్ ఓలు, తదితరులు పాల్గొన్నారు

# శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణకు దాతల విరాళం

శ్రీశైలం జూన్ 16 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానంలో అన్న ప్రసాద వితరణకు, కె. ఆనంద బసవరాజ్, హుబ్లీ, కర్ణాటక కు చెందిన కుటుంబ సభ్యులు రూ" 1,00.000/- లను ఆలయ పర్యవేక్షకులు పి. దేవికకు ఈ విరాళాన్ని అందజేయడం జరిగింది. దాతకు తగు రసీదు, ప్రసాదాలు, శేష వస్త్రం, అందజేశారు శ్రీశైల



పుణ్యక్షేత్రానికి ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తాదులు తమ మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తాదులకు శ్రీశైలం ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించడం హర్షించదగ్గ విషయమని కర్ణాటకకు చెందిన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

వార్త సాక్ష్యం జూన్ 16 నిర్మల్ జిల్లా ప్రతినిధి

జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటల విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆయిల్ పామ్ పంటల సాగుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం లో భాగంగా జిల్లాకి 3000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకి నీటి వసతి ఉన్న రైతులను గుర్తించి, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశం లో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు,ప్రీ యూనిక్ కంపెనీడమైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారికి 40 ఎకరాల వరకు ఆయిల్ పామ్ ను పెట్టె రైతులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అదేశించడం జరిగింది. చిన్న,సన్నకారు రైతులను గుర్తించి ఆయిల్ పామ్ పంట వైపు రైతుల న పంట మార్పిడి చేసేవిధంగా చేయాలనీ వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులకు అదేశించడం జరిగింది. అధిక ఆదాయం ఇచ్చే అధునాతన పంటలను సాగు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకం తో పాటు అవసరమైన సాంకేతిక సహకారాన్ని కూడా అందిస్తుంది అన్నారు. ఆయిల్ పామ్ పంటకు అనుబంధంగా మొదటి మూడు సంవత్సరాల వరకు ఇతర పంటలను కూడా పండించవచ్చునని అన్నారు. ఇతర పంటలతో పోల్చితే ఆయిల్ పామ్ సాగు తక్కువ పెట్టుబడి, తక్కువ ఎరువులు, తక్కువ కూలీలు అవసరమవ్వడమే కాకుండా, చీడపీడల ముప్పు కూడా తక్కువగా ఉండి, లాభాలు కూడా అధికంగా ఉంటాయన్నారు. ఇవే కాకుండా ఉద్యాన శాఖ నుండి పండ్లు కూరగాయలు పెంచేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. వాతవరణ పరిస్థితులను దృష్టిలో ఉంచు కొని డ్రిప్ మరియు స్ప్రింక్లర్స్ రాయితిలను రైతులు ఉపయోగించుకునేలా తెలియజేయాలన్నారు. అధికారులంతా మండలాల వారీగా రైతు వేదికలలో రైతు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల కలిగే లాభాలను వివరించాలని ఆదేశించారు. రైతులకు ఆయిల్ పామ్ పంటల సాగు పై ఎటువంటి అనుమానాలు ఉన్న నివృత్తి చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంచేందుకు సమిష్టిగా సహకారం అందివ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.వి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, ప్రియునిక్ కంపెనీ డైరెక్టర్ పాశం ప్రసాద్,ఏరియా మేనేజర్స్, క్షేత్రస్థాయి ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.






# యూరియా పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం





**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ,**
**జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్**
**-ఎరువుల నిల్వలు, ఆన్‌లైన్ పంపిణీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ**

వార్త సాక్ష్యం జూన్ 16 నాగర్ కర్నూల్

ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని గ్రోమోర్ క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించి యూరియా నిల్వలు, ఆన్‌లైన్ పంపిణీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పరిమాణం, రైతుల అవసరాలు, రాబోయే రోజుల్లో ఉండే డిమాండ్‌కు అనుగుణంగా నిల్వల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దుకాణంలో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, మున్సిపల్ అనుమతులు, నానో యూరియా, నానో డీఏపీ వంటి ఉత్పత్తుల లభ్యతపై కూడా వివరాలు సేకరించారు.జిల్లాలో ఎక్కడా యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు నిరంతరాయంగా ఎరువులు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ రైతులకు ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతున్న యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. రైతుల ఆధార్ ధృవీకరణ, బయో మెట్రిక్ నమోదు, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల ద్వారా జరుగుతున్న విక్రయాల విధానాన్ని పరిశీలించి, ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని అధి, కారులను ఆదేశించారు. పంపిణీ కేంద్రంలో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల నమోదులు, రోజువారీ లావాదేవీల వివరాలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల సరఫరా మరియు విక్రయాల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఖరీఫ్ సాగు కాలంలో ఎరువుల నిల్వలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగు తుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. యూరియా పంపిణీ ప్రక్రియను మరింత సమర్థవ ంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించిన కలెక్టర్, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రఘునాథ్ రావు, ఆర్డీవో సురేష్ బాబు, నాగర్‌కర్నూల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి పూర్ణచంద్రారెడ్డి, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, సంబంధిత శాఖల అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు, ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**-మెట్ పెల్లి తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

వార్త సాక్ష్యం జూన్ 16 జగిత్యాల:

మెట్ పెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ మరియు సాధాబైనామ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచిం చారు.మరియు మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవల సిందిగా అధికారులకు ఆదేశించారు.ఎస్.ఐ.ఆర్ లో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యూమ రేటర్లు, సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ నీత , రెవెన్యూ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో వివిధ కమిషనరేట్ల పరిధిలోపలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు

వార్త సాక్ష్యం:

తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగం పై భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి ఈ నేపథ్యంలోమంగళవారం ఈగల్ ఫోర్స్ పలుప్రాంతాల్లో ఏక కాలంలో దాడుల నిర్వహించింది.ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి గంజాయితోపాటు డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. పట్టుబడిన వారందరూ డ్రగ్స్ వినియోగించినట్లు విచారణలో అంగీకరించారని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. వీరందరిని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించామని పేర్కొంది. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపింది.హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగల్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఈగల్ పోర్స్15 బృందాలను ఏర్పాటు చేసి వారి సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ విచారణలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి నుంచి ఈగల్ ఫోర్స్ పలు కీలక విషయాలు రాబట్టింది. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతంలో ఒక ముఠా హాస్టల్ తీసుకుని కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుక్కొంది. సినీ పరిశ్రమ లోని పలువురికి వీటిని విక్రయించినట్లు ఈ దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది వినియోగదారులను ఈగల్ ఫోర్స్ గుర్తించింది.ఈ డ్రగ్స్ వినియోగదారులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు గోవాలో ఉన్నట్లు ఈ విచారణలో ఈగల్ టీం కనుక్కొంది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల ఖాతాలకు రూ.3.13 లక్షలకుపైగా నగదు బదిలీ అయినట్లు గుర్తించింది. 2019 లో వీరిద్దరు ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగల్ టీం వెల్లడించింది.

## జూన్ 20న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నట్లు రాజీ చేసుకోవాలనుకునే వారు సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి రాజగోపాల్**




వార్త సాక్ష్యం జూన్ 16 ఖమ్మం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి పి.దేవి మానస బ్యాంకర్లు చిట్ఫండ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి రాజగోపాల్ మాట్లాడుతూ జూన్ 20న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నట్లు రాజీ చేసుకోవాలనుకునే వారు దీన్ని సద్వినియోగం చేసుకొని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని సూచించారు. అదేవిధంగా రాబోయే జాతీయ లోకా ఆదాలత్ ను అందరూ ఉపయోగించుకోవాలని ఎక్కువ సంఖ్యల రాజీ పడాలని" రాజియే రాజ మార్గమని" అన్నారు. లోక్ ఆదాలత్ లో రాజీ పరుచుకునే వారు అప్పిలు అనగా పై కోర్టులకు వెళ్లే అవసరం ఉండదని అన్నారు. ఖమ్మం కోర్టులో 2,733 NI Act కేసులు మరియు 1118 ఇన్సూరెన్స్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని వీటన్నింటిని రాజీపరిచేలా పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో బార్ ప్రెసిడెంట్ వై. రమేష్ బార్ కౌన్సిల్ మెంబర్ ఎమ్. శ్రీనివాస్ మరియు ఇతర చిట్ఫండ్ కంపెనీలు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను అభినంధించిన పోలీస్ కమిషనర్

వార్త సాక్ష్యం జూన్ 16 ఖమ్మం



చిన్నారులపై లైంగిక వేధింపులు పోక్సో కేసుల్లో, గంజాయి వంటి తీవ్రమైన చీణూూ కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడం, ప్రాసిక్యూషన్, పోలీసుల సమన్వయంతో నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ. నేరస్థులకు జీవిత ఖైదు, 20 ఏళ్ల జైలు శిక్ష మొదలు అనేక కఠిన కారాగారా శిక్షలు పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఏడాదిలో ఇప్పటికే ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అయిన ఐదు పోక్సో కేసుల్లో ఖమ్మం అర్బన్ కేసు లో నిందుతుడికి జీవిత ఖైదు, రఘునాథపాలెం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష, ఖమ్మం రూరల్ రెండు వేర్వేరు కేసులో ఏడు, ఐదు సంవత్సరాల జైలు,రఘునాథపాలెం కేసులో మూడు సంవత్సరాల ఆరు నెలల శిక్ష పడ్డాయి.అదేవిదంగా గంజాయి వంటి 10 చీణూూ కేసుల్లో ఆరు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, మరో రెండు కేసుల్లో 10 ఏళ్ల జైలు, ఒక కేసులో ఏడు ఏళ్ల జైలు, రెండు కేసుల్లో ఏడాది వరకు జైలు శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ అభినందించారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 17 జూన్, 2026

## 21న నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**- పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.**
**-అభ్యర్థులు ఆభరణాలు ధరించవద్దు.**
**-కలెక్టర్ చిత్రా మిశ్రా.**

వార్త సాక్ష్యం జూన్ 16 కరీంనగర్



ఈనెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రతతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య, ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి పరీక్షకు 15 నిమిషాలు ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అభ్యర్థులు పాస్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆభరణాలు, షూలు ధరించి రావద్దని.. నిబంధనలు విధిగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రం వద్ద మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షకు రెండు రోజుల ముందే అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు బృందంగా ఏర్పడి పరీక్ష నిర్వహణను విజయవంతం చేయాలన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా పరీక్ష కేంద్రానికి అదనంగా ఒక జిల్లా అధికారిని నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే రోజున యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ ఉంటుంది కాబట్టి విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రం, సమాధాన పత్రాలు రవాణాకు ప్రత్యేక బందోబస్తు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ పంకజ్ సింగ్, డీఈఓ ప్రశాంత్, అశోక్ రెడ్డి, ఏసీపీ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాతాశిశు సంరక్షణకు అంకిత భావంతో కృషి చేయాలి



వార్త సాక్ష్యం నిజామాబాద్, జూన్ 16

మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రసవాల సందర్భంగా మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తూ, నిశిత పర్యవేక్షణ జరపాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతా శిశు మరణాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఇటీవలి కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న మాతాశిశు మరణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ ఆసుపత్రిలో సంఘటన చోటుచేసుకుంది, మరణం సంభవించడానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ, వైద్య సేవలలో ఏమైనా లోపం జరిగిందా అని ఆరా తీస్తూ, రికార్డులను పరిశీలించారు. మాతాశిశు మరణాలు జరగకుండా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ సంఘటన జరిగినా లోతుగా పరిశీలన జరుపుతామని, నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించినట్టు వెల్లడి అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరుపుతూ, అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. వారు పుట్టింటికి వెళ్ళిన పక్షంలో వారి హెల్త్ రికార్డును అక్కడి అధికారులకు పంపాలని, క్షేత్రస్థాయిలో ఆశాలు, అంగన్వాడీలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, వారి ఇళ్ళను సందర్శించి ఆరోగ్య స్థితిని వాకబు చేయాలని అన్నారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో తప్పనిసరిగా తగిన పరిజ్ఞానం కలిగిన నిపుణులైన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, వైద్య పరీక్షలు, చికిత్సలు అందించే విషయంలో ఎలాంటి లోపం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రక్త హీనత, బీ.పీ పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని, అవసరమైన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తూ, ఎంతో విలువైన నిండు ప్రాణాలు కాపాడాలని సూచించారు. కాన్పు సందర్భంగా అనుకోని పరిస్థితుల్లో తల్లి మరణిస్తే, బాధిత కుటుంబం చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ,టి.వినయ్ డీ.సీ.హెచ్.ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, కమిటీ సభ్యుడు బుస్స ఆంజనేయులు, స్వంచ్చంధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత వైద్యాధికారులు, వైద్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఏసీబీ అధికారుల దాడులలో మరో అవినీతి తిమింగలం





**-ల్యాండ్ సర్వే డీడీ నరహరి నివాసాల్లో ఏసీబీ సోదాల్లో భారీ అక్రమాస్తులు**
**-రూ.1కోటి 20 లక్షల నగదు నోట్లకట్టలతోపాటు కిలోన్నర కు పైగాబంగారుఆభరణాలు**
**-పెరిగిపోతున్న రూ.100 కోట్ల అక్రమార్కుల అవినీతి తిమింగలాల జాబితా**

వార్త సాక్ష్యం:

ల్యాండ్ అండ్ సర్వే డీడీ నరహరి నివాసాల్లో ఏసీబీ సోదాల్లో భారీ అక్రమాస్తులు బయటపడ్డాయి. రూ.1.20 కోట్లు నగదు, కిలోన్నర బంగారం స్వాధీనం చేసుకున్నారు. రూ.1కోటి 20 లక్షల నగదు నోట్లకట్టలతోపాటు కిలోన్నర కు పైగాబంగారు ఆభరణాలుతెలంగాణ ఏసీబీ అధికారులు మరో అవినీతి తిమింగలాన్ని పట్టేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ల్యాండ్ ఆండ్ సర్వే డిప్యూటీ డైరక్టర్ నరహరి నివాసాలలో ఏసీబీ నిర్వహించిన దాడులలో భారీగా అక్రమాస్తులు వెలుగు చూశాయి. ఏక కాలంలో నరహరికి చెందిన కార్యాలయం, నివాసాలు, బంధువుల ఇళ్లలో 10చోట్ల ఏసీబీ బృందాలు తనిఖీలు కొనసాగిస్తున్నాయి. హైదరాబాద్ పాతబస్తీ ఛత్రినాకలోనినరహరి ఇంట్లో ఇప్పటికే రూ.1కోటి 20లక్షల నగదు నోట్ల కట్టలతో పాటు కిలోన్నరకు పైగా బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో బ్యాంకు డిపాజిట్లు, ఆస్తి పత్రాలు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు .ఇప్పటివరకు సోదాలలో గుర్తించిన అక్రమాస్తుల విలువ బహిరంగ మార్కెట్ లో రూ.150కోట్ల నుంచి 200కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. నరహరి అక్రమాస్తుల లెక్కలు సోదాలు పూర్తయ్యాక ఈ సాయంత్రానికి స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు.పెరిగిపోతున్న రూ.100 కోట్ల అక్రమార్కుల అవినీతి తిమింగలాల జాబితా గతంలో హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ రూ.300 కోట్లకు పైగా ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో అరెస్టయ్యారు.ఆ తర్వాతా రూ.100కోట్ల అక్రమాస్తుల మార్కు దాటిన వారిలో వరుసగా జలమండలి జీఎం అనంతలక్ష్మీ కుమార్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఉండటం గమనార్హం. తాజాగా ల్యాండ్ ఆండ్ సర్వే డిప్యూటీ డైరక్టర్ నరహరి కూడా ఈ అవినీతి తిమింగలాల జాబితాలో చేరిపోయాడు. రంగారెడ్డి జిల్లా సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కే శ్రీనివాసులుపై జరిపిన సోదాల్లోనూ రూ.100 కోట్లకు పైగానే ఆక్రమాస్తులు గుర్తించారు. టీజీఎస్పీ డీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అంబేద్కర్ ఎరుగు, కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజనీర్ నూనె శ్రీధర్, మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు , ట్రాన్స్‌పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్లపై నిర్వహించిన సోదాల్లోనూ వంద కోట్ల మేరకు అక్రమాస్తులు గుర్తించారు. హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి కేసులో, ఇటీవల మాజీ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు ఏసీపీ భుజంగరావుపై ఏసీబీ జరిపిన సోదాల్లోనూ భారీగా అక్రమాస్తులు గుర్తించిన సంగతి తెలిసిందే

## ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు





**-భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం**
**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
**-డిఫెన్స్‌కు 1,500 ఎకరాలు.. రన్‌వే విస్తరణకు మరో 80 ఎకరాలు**
**-ఎంపీ,ఎమ్మెల్యే, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష**

వార్త సాక్ష్యం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి :

ఆదిలాబాద్ జాయింట్ యూజర్(డిఫెన్స్-సివిల్) ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బెంగళూరుకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధి కారులు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన, మైక్రో లెవెల్ సర్వే నిర్వహించి, రన్‌వే విస్తరణతో పాటు సాంకేతిక అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామన్నారు.ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అదనంగా డిఫెన్స్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) కోసం 1,500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందని వివరించారు. జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేసిన కలెక్టర్, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతి నిధుల సూచనల మేరకు త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీకి భూములను అప్పగి స్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు సివిల్ ఏవియేషన్‌తో పాటు డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావడం ప్రజలకు ఒక చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు.

**-ఢిల్లీ స్థాయిలో ఇప్పటికే చర్చలు ఎంపీ గోడం నగేష్**

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన లొకేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించామని, మే 15న కేంద్ర ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందని గుర్తుచేశారు.రక్షణ శాఖ కోరిన 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లా అధికారులతో కలిసి మ్యాప్‌ల ఆధారంగా మైక్రో లెవెల్ సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు వేగవం తానికి నేటి సమావేశం కీలక ముందడుగు అని పేర్కొన్నారు.

**-దశాబ్దాల కల నెరవేరబోతోంది ఎమ్మెల్యే పాయల శంకర్**

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణపై నేటి సమావేశంతో స్పష్టత వచ్చిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి మొత్తం 1,840 ఎకరాలు అవసరమవుతాయని, ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. ఇప్పటికే 360 ఎకరాలు రక్షణ శాఖ పరిధిలో ఉండగా, రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు.గతంలో జారీ చేసిన 700 ఎకరాల జీవో ప్రకారం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 800 ఎకరాల అనుమతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చెప్పారు. తదుపరి విధానపరమైన నిర్ణయాల కోసం త్వరలో ఎంపీ నేతృత్వంలో ఢిల్లీలో ఉమ్మడి సమావేశం జరగనుందని, ఇందులో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్‌లతో చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఆదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల నెరవేం బోతోందని, జిల్లా అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకోనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు,ఎస్. రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతా ధికారులు జేపీ సబర్వాల్,ఎస్.జి.హెగ్డే, ఎస్.కె.రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెస్టారెంట్లలో ఆహార భద్రతాధికారుల తనిఖీలు

వార్త సాక్ష్యం నిజామాబాద్ జూన్ 16



బోధన్ పట్టణంలోని వివిధ ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు మరియు రెస్టారెంట్లలో ఆహార భద్రతాధికారి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా పరిశుభ్రత మరియు ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించిన పలు లోపాలు గుర్తించబడ్డాయి. కొన్ని సంస్థల్లో సింథటిక్ ఆహార రంగులు మరియు టేస్టింగ్ సాల్ట్ (ఎంఎస్‌జీ) వినియోగం ఉన్నట్లు గుర్తించ బడింది. అదేవిధంగా, రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉంచిన మిగిలిపోయిన ఆహార పదార్థాలు కూడా గుర్తించ బడ్డాయి. సంబంధిత ఆహార వ్యాపార నిర్వాహకులకు మెరుగుదల నోటీసులు జారీ చేశారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం 2006 నియమాలు మరియు నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తగిన జరిమానాలు విధించబడతాయన్నారు.అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, నిర్దేశిత పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య ప్రమాణాలను నిర్వహించాలని సూచించారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి





-జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్
-బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి..
-నాణ్యమైన బోధనతో విద్యార్థులు డ్రాపౌట్స్ లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి..
-సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

వార్త సాక్ష్యం జూన్ 16 ఖమ్మం

పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.మంగళవారం సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ప్రక్రియను సమీక్షించి, ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ,బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయాలని తెలిపారు. ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అన్నారు. పాఠశాల వంటగది, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సేవల అమలుపై ఆరా తీశారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, పిల్లలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సింగరేణి మండల తహసీల్దారు వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి





-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-వైద్యులు, సిబ్బంది సమయపాలనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి..
-నూతన ఆసుపత్రి అందుబాటుతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు..
-వైరా పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసి,
-నూతనంగా నిర్మాణంలో ఉన్న ఏరియా హాస్పిటల్ పురోగతి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

వార్త సాక్ష్యం జూన్ 16 ఖమ్మం

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం వైరా నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వైరా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారీ నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసరపు సి-సెక్షన్ ఆపరేషన్ చేయవద్దని అన్నారు. వార్డ్ లో కేసు షీట్ లను పరిశీలిస్తూ రోగులకు అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. అంతకు ముందు వైరా మండలం కేంద్రంలో నూతనంగా రూ. 37.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో సమన్వయ సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వం వైద్య రంగాల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు.పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డా.రాజశేఖర్ గౌడ్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

వార్త సాక్ష్యం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి :

జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్,జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య లతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదిగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని,అదే రోజున జిల్లాలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2026 వనమహోత్సవం లో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటడంలో సంబంధిత అధికారులకు అటవీ అధికారులు సహాయం అందిస్తారని, మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి,రోజు వారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని,నాటిన ప్రతి ఒక్క మొక్క



ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అటవీ భూముల తగాదాలు ఉన్నచోట వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలలో మొక్కలను నాటాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



వార్త సాక్ష్యం నిజామాబాద్, జూన్ 16

ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కామన్ డైట్ మెనూను అనుసరిస్తూ విద్యార్థులకు నాణ్యతతో, పరిశుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. డిచ్పల్లి మండలం సుద్దపల్లి లోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్ లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. పుస్తకాలు, నోట్ బుక్కులు పూర్తి స్థాయిలో వచ్చాయా అని ఆరా తీశారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్ లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు వస్తేనే వారితో పంపాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు పాఠశాలకు హాజరు కాని విద్యార్థినుల పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు ఎందుకు పాఠశాలకు రావడం లేదనే విషయాన్ని ఆరా తీయాలన్నారు. పాఠశాలలో పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పనులను తక్షణమే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం సెకండియర్ క్లాస్ రూమ్ కు వెళ్లి విద్యార్థినులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేస్తూ, సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందజేశారు. చక్కగా చదువుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇంచార్జి ప్రిన్సిపాల్ స్వప్న, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# బాధిత మహిళలకు అండగా 'భరోసా' కేంద్రాలు

-అడిషనల్ డీసీపీ రామానుజం




వార్త సాక్ష్యం జూన్ 16 ఖమ్మం

చిన్నారులపై హింసను అరికట్టడానికి, బాధిత మహిళలకు సమగ్ర సేవలను అందించడానికి 'భరోసా' కేంద్రాలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ.అండగా నిలుస్తున్నాయని అడిషనల్ డీసీపీ రామానుజం అన్నారు.హింస, లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, చిన్నారులకు భరోసా కేంద్రాల ద్వారా అందించే సహాయాన్ని, పునరావాస సేవలను బలోపేతం చేయడం కోసం వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయం కాన్ఫిరెన్స్ హాల్లో మంగళవారం జరిగింది. ఈ సందర్బంగా అధికారులకు పలు మార్గదర్శకాలు అడిషనల్ డీసీపీ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో దగా పడ్డ మహిళలకు అండగా నిలవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాల ద్వారా పోలీస్, వైద్య, న్యాయ,మానసిక కౌన్సెలింగ్ సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో వేధింపులకు గురైన బాధితులకు మరల ఇటువంటి వాటి బారిన పడకుండా చూడడమే భరోసా సంస్థ యొక్క ముఖ్య లక్ష్యమన్నారు.లైంగిక వేధింపులు, గృహ హింస గురైన మహిళలు, పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందించడంలో భరోసా కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బాధితులకు చేయూతనిచ్చే ఈ సేవల సమర్థవంతమైన నిర్వహణకు గాను పోలీసు,రెవిన్యూ, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ శాఖల తదితర అధికారులందరూ ఒకే ప్రాంగణంలో ఉండి బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తారన్నారన్నారు. పోలీస్ స్టేషన్, కోర్టుల వాతావరణానికి దూరంగా, బాధితులకు ఎలాంటి భయం లేకుండా సురక్షితమైన, గోప్యమైన వాతావరణంలో సాయం అందేలా చూస్తారన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు నిపుణులైన సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని నింపుతారన్నారని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు నుండి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు న్యాయ నిపుణులు ద్వారా బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించి న్యాయం జరిగేలా చూస్తారన్నారు. బాధితుల కోసం స్వల్పకాలిక ఆశ్రయం, చదువుకునే సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి శిక్షణ ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటును అందిస్తారన్నారు. ఈసమావేశంలో ICPS అధికారులు,, చైల్డ్ లైన్ ప్రతినిధులు, సి డబ్ల్యూ & జేజేబు సభ్యులు, సభ్యులు, డిఎల్ ఎస్ ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ ఈఆర్ పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కౌన్సిలర్లు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

## పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రీముఖి

-సరైన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నానన్న శ్రీముఖి
-తాను కోరుకున్న వ్యక్తి దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని వెల్లడి
-త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పండి అంటూ నెటిజన్ల స్పందన



యాంకర్, నటి శ్రీముఖి తన పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ... "ఈ సినిమా ప్రారంభమైనప్పుడు సమంత పెళ్లి జరిగింది. ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అయితే నా పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించింది. సరైన పెళ్లి కొడుకు కోసం ఎదురుచూస్తున్నానని, దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని తెలిపింది. ఈ సందర్భంగా ప్రేక్షకులు, సినీ ప్రముఖులు చప్పట్లతో స్పందించగా, అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు శు భాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొందరు "త్వరలో గుడ్ న్యూస్ చెప్పండి" అంటూ సరదా కామెంట్లు చేస్తున్నారు. కాగా, దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన 'మా ఇంటి బంగారం' జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీముఖ కీలక పాత్ర పోషించింది.

# 12 ఏళ్లుగా ల్యాబ్‌కే పరిమితమైన త్రిష సినిమా ఇప్పుడు విడుదలకు రెడీ!



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ త్రిష గురించి ఎంత చెప్పినా తక్కువే. హారర్, కామెడీ, క్రైమ్, లేడీ ఓరియంటెడ్.. ఇలా ఏ జోనర్ అయినా తన మార్క్ నటనతో మెప్పిస్తూ దశాబ్దాలుగా అగ్రశ్రేణి హీరోయిన్‌గా రాణిస్తోంది. అయితే, ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో జరిగిన కీలక మార్పులు, ముఖ్యంగా దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరుణంలో.. విజయ్‌తో త్రిష రిలేషన్ గురించిన రూమర్స్ సోషల్ మీడియాలో ఏ రేంజ్‌లో వైరల్ అయ్యాయో మనందరికీ తెలిసిందే. ఈ పొలిటికల్, పర్సనల్ బజ్ వల్ల తమిళనాడు మార్కెట్‌లో త్రిష క్రేజ్ ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. ఇప్పుడు ఇదే క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు.. ఏకంగా 12 ఏళ్లుగా ల్యాబ్‌కే పరిమితమైన త్రిష పాత సినిమాను థియేటర్లలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్రిష, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో నిర్మల్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'శతురంగ వెట్టై-2'. నిజానికి ఈ సినిమా షూటింగ్ 2014లోనే పూర్తయింది. కానీ ఆ సమయంలో నిర్మాతలకు ఎదురైన తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ రిలీజ్ కాకుండా అటకెక్కింది. ఇన్నేళ్లపాటు ఈ సినిమాను ఎవరూ పట్టించుకోలేదు. కానీ, ప్రస్తుతం తమిళనాడులో త్రిషకు ఉన్న విపరీతమైన క్రేజ్, పొలిటికల్ కనెక్టివిటీ నేపథ్యంలో.. ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను థియేటర్లలోకి వదిలితే కచ్చితంగా భారీ కలెక్షన్స్ రాబట్టవచ్చని చిత్ర బృందం గట్టిగా అంచనా వేస్తోంది. అందుకే 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 'శతురంగ వెట్టై-2'ను రిలీజ్ చేసేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

# స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది: సమంత

-స్టార్‌డమ్‌ను చూసి ఆశ్చర్యపోయానన్న సమంత
-వరుస హిట్లతో స్టార్‌డమ్‌కు బానిసయ్యానని వ్యాఖ్య
-నటిగా అహంకారం పెరిగి తనకు ముగింపు లేదనుకున్నానని వెల్లడి
-అనారోగ్యంతో తీసుకున్న విరామం ఆలోచనలను మార్చిందన్న హీరోయిన్
-జూన్ 19న ప్రేక్షకుల ముందుకు 'మా ఇంటి బంగారం' సినిమా



స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు.'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను. ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు."అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది. తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా' అని సమంత తెలిపారు. 2022లో తాను మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడు తున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

## 'డార్లింగ్ సీఎం విజయ్'.. హీరో విశాల్ ఆసక్తికర పోస్ట్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ఇటీవల కలిసిన నటుడు, నిర్మాత విశాల్ 'డార్లింగ్ సీఎం విజయ్' అంటూ చేసిన సోషల్ మీడియా పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. లయోలా కాలేజీ రోజుల నుంచే విజయ్‌ను తాను 'డార్లింగ్' అని పిలుస్తున్నానని చెప్పారు. ఇప్పటికీ అదే పిలుపు కొనసాగుతోందని విశాల్ తెలిపారు.సోషల్ మీడియాలో పంచుకున్న సందేశంలో విజయ్ సినీ రంగంలో ఎదిగిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఓ యువ నటుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం సూపర్‌స్టార్ స్థాయికి చేరిందని కొనియాడారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఎన్నో విమర్శలు, సవాళ్లను మౌనంగా ఎదుర్కొంటూ విజయాన్ని సాధించారని కొనియాడారు. ముఖ్యమంత్రి పదవి వచ్చినా విజయ్ వ్యక్తిత్వంలో ఎలాంటి మార్పు రాలేదని విశాల్ వెల్లడించారు. చాలా ఏళ్ల క్రితం ఎలా కలిసేవారో, ఇప్పటికీ అదే ఆప్యాయత కనిపించిందన్నారు. గతంలో కరుణానిధి, జయలలిత, స్టాలిన్, ఉదయనిధి వంటి నేతలతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# బాక్సాఫీస్ వద్ద దయ్యాల జాతర.. థియేటర్లలో వణుకుతున్న జనాలు.. కలెక్షన్ల సునామీ!

-బాక్సాఫీస్‌పై హారర్ సినిమాల ఆధిపత్యం
-హాంటెడ్ 3఑ కలెక్షన్ల జోరు
-అబ్సెషన్ మూవీ సంచలన వసూళ్లు
-ఇండియాలో 'బ్యాక్‌రూమ్స్' క్రేజీ ఓపెనింగ్స్
-చిన్న చిత్రాల ముందు నిలవలేకపోతున్న స్టార్ల సినిమాలు

ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద హారర్ జానర్ చిత్రాలు సంచలనాలు సృష్టిస్తున్నాయి. స్టార్ హీరోల భారీ బడ్జెట్ సినిమాలు సైతం కలెక్షన్ల కోసం ఇబ్బంది పడుతున్న తరుణంలో.. విక్రమ్ భట్ సరికొత్త హారర్ థ్రిల్లర్ 'హాంటెడ్ 3఑: ఎకోస్ ఆఫ్ ది పాస్ట్', హాలీవుడ్ సంచలనం 'అబ్సెషన్' , ఏ24 ప్రొడక్షన్ నుంచి వచ్చిన 'బ్యాక్‌రూమ్స్' చిత్రాలు థియేటర్లలో కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రధాన మల్టీప్లెక్స్ చైన్లలో కొన్ని చట్టపరమైన ఇబ్బందుల వల్ల పెద్దగా స్క్రీన్లు దక్కకపోయినప్పటికీ సింగిల్ స్క్రీన్స్, బి, సి సెంటర్లలో హాంటెడ్ 3఑ అద్భుతమైన వసూళ్లతో దూసుకు పోతోంది. మహాక్షయ్ చక్రవర్తి ప్రధాన పాత్రలో నటించిన 'హాంటెడ్ 3఑' చిత్రం జూన్ 12న విడుదలై.. మొదటి రోజే ఏకంగా రూ. 2.50 కోట్ల నెట్ కలెక్షన్లతో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఎలాంటి ఆఫర్లు లేకపోయినా కేవలం పాజిటివ్ టాక్ ) తో వీకెండ్ ముగిసేసరికి ఈ చిత్రం ఇండియాలో సుమారు రూ. 10 కోట్ల మార్కును దాటేసింది. కేవలం రూ. 15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా చాలా త్వరగానే లాభాల బాట పట్టేలా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రముఖ యూట్యూబర్ కర్రీ బార్కర్ కేవలం ఒక మిలియన్ డాలర్ల కంటే తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కించిన సైకలాజికల్ హారర్ చిత్రం 'అబ్సెషన్' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 200 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి చరిత్ర సృష్టించింది. ఈ చిత్రం ఇండియాలోనూ ఏకంగా రూ. 50 కోట్ల క్లబ్‌లో చేరి నిలకడైన వసూళ్లతో రన్ అవుతోంది.మరోవైపు, వైరల్ యూట్యూబ్ కాన్సెప్ట్ ఆధారంగా యువ క్రియేటర్ కేన్ పార్సన్స్ దర్శకత్వంలో వచ్చిన 'బ్యాక్‌రూమ్స్' సినిమా కూడా హాలీవుడ్ రోల్‌అవుట్‌లో భాగంగా ఇండియాలో అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించింది. గత శు క్రవారం ఒక్క రోజే ఈ మూడు హారర్ చిత్రాలు కలిసి బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 6.75 కోట్ల గ్రాస్‌ను రాబట్టాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను తెచ్చిపెట్టే హారర్ జానర్‌కు భారతీయ ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారని ఈ తాజా కలెక్షన్ల ట్రెండ్ మరోసారి నిరూపించింది. థియేటర్లలో సీట్ల అక్యుపెన్సీ రోజురోజుకూ పెరుగుతు ండటంతో అటు ఎగ్జిబిటర్లు, ఇటు నిర్మాతలు ఫుల్ ఖుషీ అవుతున్నారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.